

టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.2,500, సరాసరిన రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే

ఏసుక్రీస్తు త్యాగాలకు ప్రతీక అయిన గుడ్‌ఫ్రైడేను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని చర్చిల్లో జరుపుకోనున్నారు. ఆయా చర్చిల్లో ఏర్పాట్లను పూర్తి చేశారు.

10లో

గరిష్ఠం/కనిష్ఠం
40.4°/21.2°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా చింతపండు రూ.20 వేలు



మార్కెట్‌లో చింత పండు క్రయవిక్రయాలు

హిందూపురం అర్బన్: మార్కెట్‌లో చింతపండు ధర తగ్గింది. గురువారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 770.70 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.16 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ. 12,200, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.8 వేల ప్రకారం ధర పలికింది.

90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు



రైతు అజంతుల్లా ఏర్పాటు చేసిన డ్రిప్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న పీడీ

గోరంట్ల: అర్హులైన చిన్న సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లను అందిస్తామని జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ సుదర్శన్ పేర్కొన్నారు. గురువారం మండలంలో ఆయన పర్యటించారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు అందించిన డ్రిప్, స్ప్రింక్లర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువకు మళ్లీ గండి



హంద్రీనీవా కాలువకు గండిపడటంతో వృథాగా వెళ్తున్న నీరు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని హంద్రీనీవా కాలువకు గురువారం మరోసారి గండి పడింది. రెండు నెలల కాలంలో మూడుసార్లు కాలువ తెగిపోవడంపై అధికారులు , స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 4 గంటల పాటు కాలువలో నీరు వృథాగా పోయింది. అనంతరం తాత్కాలికంగా గండిని పూడ్చారు. ఎస్‌ఐ రమేష్‌బాబు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.

యూరియా అమ్మకాలపై కేసు

హిందూపురం: నాణ్యత లేని యూరియా అమ్మకాలపై వ్యవసాయ అధికారులు కేసు నమోదు కావడంతో హిందూపురంలోని బృందావన్ ట్రేడర్స్, చిలమత్తూరులోని సాయికృప ట్రేడర్స్, ఐఎఫ్ఎఫ్‌సీఓ కంపెనీలపై కోర్టు నుంచి సమన్లు జారీ అయినట్లు తెలిసింది. మూడేళ్ల క్రితం ఐఎఫ్ఎఫ్‌సీఓ కంపెనీ సరఫరా చేసిన యూరియాను హిందూపురంలోని బృందావన్ ట్రేడర్స్ నిర్వాహకులు చిలమత్తూరులోని సాయికృప ట్రేడర్స్‌కు యూరియా సరఫరా చేసినట్లు సమాచారం. అప్పటి మండల వ్యవసాయ అధికారి చిలమత్తూరు సాయికృప ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి యూరియా నమూనా తీసి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. ఆ యూరియా నాణ్యత లేదని తేలడంతో వ్యవసాయాధికారులు వీరిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ముగ్గురు ఈనెల 22వ తేదీ అనంతపురం కోర్టులో హాజరు కావాలని నోటీసులు వచ్చినట్లు తెలిసింది.

బాల్యానికి... మూడు ముళ్లు!

- ఓ యువకుడు.. ఇద్దరు బాలికల వివాహ పత్రిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ నెల 9న గోరంట్లలో జరగాల్సిన వివాహం చర్చకు దారి తీయడంతో బాలల సంరక్షణ అధికారులు పరిశీలించారు. సదరు యువతులకు 18 ఏళ్లు నిండకపోవడంతో వివాహాలను అడ్డుకున్నారు. బాల్య వివాహం నేరమని కాదూ కూడదు అని ముందుకెళ్తే కటకటాలు తప్పవని అధికారులు హెచ్చరించారు.
- ఇంటర్ చదువుతోన్న ఓ బాలికను 20 ఏళ్ల యువకుడు ప్రేమ పేరుతో ముగ్గులోకి దింపి వివాహం చేసుకుంటానని నమ్మబలికాడు. పెళ్లి చేసుకునే తమకు రక్షణ కావాలంటూ తొలుత అమ్మాయి పోలీసులను ఆశ్రయించింది. అయితే బాలిక వయసు 17 ఏళ్లు కావడంతో కుటుంబ సభ్యులను పిలిచారు. అప్పటికే యువకుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు కేసు వద్దని చెప్పడంతో ఇరు కుటుంబాలకు సర్దిచెప్పి పంపించారు. ఈ ఘటన పుట్టపర్తిలో వెలుగు చూసింది.
- గోరంట్లకు చెందిన ఓ యువకుడు బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ ఓ బాలికతో ప్రేమలో పడ్డాడు. ఎవరికీ తెలియకుండా రహస్య వివాహం చేసుకుని పరారై వచ్చారు. బాలిక బంధువులు పోలీసులను ఆశ్రయించగా.. కొన్ని నెలల తర్వాత ధర్మవరంలో పట్టుబడ్డారు. అప్పటికే బాలిక గర్భం దాల్చింది. పైగా 18 ఏళ్లు దాటి పది రోజులు పూర్తి కావడంతో ఇరు కుటుంబాలకు సర్దిజెప్పి పంపించారు.

- అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఆగని బాల్య వివాహాలు
- గుట్టుచప్పుడుకాకుండా పెళ్లిళ్లు చేస్తున్న వైనం
- ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం
- గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా వెలుగులోకి..
- ఏడాదిలో 118 బాల్య వివాహాలకు చెక్

బడికి పోవాల్సిన వయసులోనే కొందరు బాలికలు బాధ్యతలు మోయాల్సి వస్తోంది. చదువుకోవాల్సిన వయసులోనే గర్భం దాల్చి అనారోగ్యాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. బాల్య వివాహాలు ఏ రకంగానూ మంచిది కాదని అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పెద్దగా మార్పు కనిపించడం లేదు.



ఆగిన బాల్య వివాహాలు ఇలా..


నెల	ఆగిన పెళ్లిళ్లు
2024 ఏప్రిల్	16
మే	08
జూన్	07
జూలై	05
ఆగస్టు	09
సెప్టెంబర్	12
అక్టోబర్	09
నవంబర్	07
డిసెంబర్	10
2025 జనవరి	12
ఫిబ్రవరి	11
మార్చి	12

సాక్షి, పుట్టపర్తి: జీవితమంటే ఏమిటో తెలియని పసి వయసులోనే ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయడం, అంతలోనే గర్భం దాల్చడం వంటి ఘటనలు జిల్లాలో పెరిగిపోతున్నాయి. బాల్య వివాహాలతో పాటు ప్రేమ వివాహాలు కూడా తెలిసీ తెలియని వయసులోనే జరిగిపోతున్నాయి. అధికారులు అప్రమత్తం కావడంతో గత 12 నెలల వ్యవధిలో 118 బాల్య వివాహాలు ఆగిపోయాయి. జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, గ్రామాల్లో అధికారులు బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. అయినా గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి.

చిన్న వయసులోనే గర్భం..

బాల్య వివాహాల కారణంగా చిన్న వయసులోనే బాలికలు గర్భం దాలుస్తున్నారు. ఫలితంగా శారీరకంగా ఎదుగుదల లోపించడంతో పాటు పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా.. గుట్టుగా పిల్లలకు మూడుముళ్ల తంతు సాగిస్తున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఆడబిడ్డల తల్లిదండ్రులు చిన్న వయసులోనే బాలికలను ఇల్లు దాటించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రేమ వ్యవహారాలు కూడా చిన్న వయసులోనే బాలికలను ఇల్లాలిని చేస్తున్నాయి. ప్రేమించిన వారు మోసగించి పరారవుతుండటంతో చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలను మోస్తున్నారు.

చట్ట ప్రకారం చర్యలు



బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098కు కాల్ చేసి సమాచారం ఇవ్వండి. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇటీవల కాలంలో కేజీబీవీలు, కాలేజీల్లో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, మహిళా చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఏడాది కాలంలో 118 బాల్య వివాహాలను అడ్డుకుని బాలికలను రక్షించాం.

– మహేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

తల్లిదండ్రులు ఆలోచించాలి



చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం నేరం. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలి. అంతకుముందే వివాహం చేయాలని చూస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. చిన్న వయసులో పెళ్లి, గర్భం దాల్చడం బాలికల ఆరోగ్యానికి ప్రమాదకరం. చదివే వయసులోనే ఇంటి బాధ్యతలు మోయాల్సిన అవసరం లేదు. చదివితే ఉన్నత స్థాయికి వెళ్లి మంచి ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు ఆలోచించాలి.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

అనంతపురం నుంచి బెంగళూరుకు రైలు

- మెమూ రైలును అనంతపురం నుంచి నడపాలని నిర్ణయం
- కొత్తగా ఏడు స్టేషన్లలో స్టాపింగ్‌కు అనుమతి



పుట్టపర్తి టౌన్: ఉమ్మడి జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. శ్రీసత్యసాయి జిల్లా ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరు వరకు నడిచే మెము రైలును ఇకపై అనంతపురం వరకు పొడిగించారు. దీంతో పాటు అనంతపురం నుంచే బెంగళూరు బయలుదేరేలా దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్వర్వులు కూడా జారీ చేయడంపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం–బెంగళూరు మధ్య ప్రత్యేక రైలు నడపాలని ఎప్పటి నుంచో ఈ ప్రాంత ప్రజలు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతూ వచ్చారు. వారి విజ్ఞప్తిని అధికారులు ఎట్టకేలకు ఆమోదించారు. త్వరలోనే ఈ రైలు అనంతపురం నుంచి బయలుదేరేలా ప్రణాళిక రచించారు. ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరు మధ్య ఇప్పటి వరకు ఉన్న స్టాపింగులతో పాటు అదనంగా ప్రసన్నాయపల్లి, జంగాలపల్లి, చిగిచెర్ల, బాసంపల్లె, కొత్తచెరువు, విదురాశ్వర్థం, సోమేశ్వరలో స్టాపింగ్ సదుపాయం కల్పించారు. సామాన్య ప్రయాణికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు రైలు ఎంతో సౌకర్యంగా ఉండనుంది. అతిత్వరలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి చేతుల మీదుగా అనంతపురం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి రోజూ మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి రాత్రి 7 గంటలకు బెంగళూరుకు చేరుకునేలా షెడ్యూల్ రూపొందించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



రిలే నిరాహార దీక్షలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మక్బూల్ అహ్మద్

- కేంద్రం ఆమోదించిన సవరణ చట్టంలో ఎన్నో లోపాలున్నాయి
- బిల్లు రద్దు చేయాలని ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణం
- 'కూటమి' మద్దతుతోనే బిల్లు ఆమోదం పొందింది
- చంద్రబాబు, పవన్‌లను ముస్లింలు ఎన్నటికీ క్షమించరన్న కేతిరెడ్డి, మక్బూల్
- ముస్లింల రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం

ధర్మవరం: వక్ఫ్ సవరణ చట్టంలో ఎన్నో లోపాలున్నాయి. వెంటనే ఆ చట్టాన్ని రద్దుచేయాలి' అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలన్న డిమాండ్‌తో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సంయుక్త మజీద్ కమిటీలు, ముస్లింలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో ఆరో రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఇక్బాల్, అజహర్, సైపుల్లా, చాంద్‌బాషా, షరీఫ్, ఘనీ తదితరులు పాల్గొన్నారు. దీక్షలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మక్బూల్ అహ్మద్ సంఘీభావం తెలిపారు. అంతకు ముందు ర్యాలీగా వచ్చి దీక్షా శిబిరంలో పాల్గొని ప్రసంగించారు.

కూటమి నేతల మోసాన్ని గ్రహించాలి..

వక్ఫ్ సవరణ చట్టంలో అనేక లోపాలున్నాయన్నాయని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తులకు రిజిస్ట్రర్ పత్రాలు చూపి హక్కులు పొందాలని ఉందని, నాలుగేళ్ల అయిదేళ్ల కిందట తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డులే ప్రస్తుతం కనిపించడం లేదని అలాంటిది వందల ఏళ్ల నాటి మజీద్‌లు, ఆస్తులకు రిజిస్ట్రర్ పత్రాలు తేవడం అసాధ్యమన్నారు. అలాగే వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు ఉండేందుకు కొత్త చట్టం అనుమతిస్తుండటం ఇబ్బందులకు కారణమవుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పూర్తయినా ఇంకా మతం , కులం పేర్లతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రూ.8 లక్షల కోట్లకు పైగా ఉన్న వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు సవరణ చట్టం తూట్లు పొడుస్తోందన్నారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన సంపూర్ణ మద్దతుతోనే చట్ట సవరణ ఆమోదం జరిగిందన్నారు. రంజాన్‌కు ముందు వక్ఫ్ సవరణకు తాము మద్దతు తెలపబోమని చెప్పిన సీఎం చంద్రబాబు ఏమొహం పెట్టుకుని మద్దతిచ్చారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ముస్లింలు కూటమి పార్టీల మోసాన్ని గ్రహించాలన్నారు. అవసరాలకు వాడుకోవడంలో చంద్రబాబుకు మించిన మోసగాడు మరొకరు లేరన్నారు. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు జరిగే అన్యాయాన్ని గ్రహించే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బిల్లుకు మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అలాగే సుప్రీంకోర్టులో చట్ట సవరణ రద్దు కోసం పోరాడుతున్నారన్నారు.

ఆమరణ దీక్షకూ వెనుకాడబోం..

వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ పోరాటం ఉధృతం చేస్తాం. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు వెనుకాబోం అని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ కేంద్రాన్ని హెచ్చరించారు. వక్ఫ్ సవరణ విషయంలో ముస్లింలకు అండగా ఉన్న వైఎస్ జగన్‌కు ముస్లిం సమాజం మొత్తం అండగా ఉంటుందన్నారు. వక్ఫ్ సవరణ విషయంలో కూటమి పార్టీలు మద్దతు తెలపడంతో రానున్న రోజుల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైన బుద్ధి తెచ్చుకుని వక్ఫ్ సవరణ చట్టంపై ముస్లిం సోదరుల పోరాటానికి కూటమి పార్టీలు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో కదిరిలో భారీ ర్యాలీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు షేక్ చాంద్‌బాషా, జాకీర్‌హుసేన్, సుభాన్, ఎస్పీ బాషా, అత్తార్ జిలాన్, ఇనాయతుల్లా, సాధిక్ వలి, ఉస్మాన్, నాయకులు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పెణుజూరు నాగరాజు, సుబ్బారెడ్డి, కత్తెపెద్దన్న, కడప రంగస్వామి, గడ్డం గంగాధర్, చింతా భాస్కర్‌రెడ్డి, చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి, దేవరకొండ రమేష్, చెలిమి రామయ్య, నులక రామయ్య, ఏలకుంట్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చేతన్, చిత్రంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వందశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎంఈ సర్వే , ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యల తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపుకోవాలన్నారు. జిల్లా సోలార్ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పశువులకు నీటి తొట్టెల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: పోక్సో కేసులతో పాటు లాంగ్ పెండింగ్, సోషల్ మీడియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సబ్ డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మద్యం అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప, హేమంత్‌కుమార్, శివన్నారాయణస్వామి, సీఐలు బాలసుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో అన్నదమ్ముల మృతి

- నీటి మడుగులో ఒకరు.. రోడ్డు ప్రమాదంలో మరొకరు
- దొరిగిల్లులో విషాదం



రమణయ్య (ఫైల్)



నీటి మడుగులో తేలియాడుతున్న మృతదేహం

ముదిగుబ్బ: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు వేర్వేరు ప్రమాదాల్లో చనిపోయారు. దీంతో ముదిగుబ్బ మండలం దొరిగిల్లు క్వార్టర్స్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికుల వివరాల మేరకు.. దొరిగిల్లు సమీపంలో గురువారం ఓ యువకుడి శవాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొరిగిల్లుకు చెందిన రమణయ్య (46) బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లి పనులు ముగిసిన తరువాత స్నానం చేసేందుకు తోట సమీపంలోని గుర్రాల మడుగులోకి వెళ్లినట్లుగా తెలుస్తోంది. ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో తమ్ముడు..

నాలుగు రోజుల క్రితం రమణయ్య సోదరుడు మునికృష్ణ (45) మొలకలచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఒకే రోజు అన్నదమ్ములిద్దరూ చనిపోవడంతో దొరిగిల్లులో విషాదఛాయలు అలముకున్నాయి. రమణయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే మునికృష్ణ భార్య ఇప్పటికే చనిపోగా కుమారుడు ఉన్నారు. కేసు నమదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రొళ్ల మండలం హనుమంతనపల్లి, వన్నారనపల్లి, హులీకుంట, దొమ్మరహట్టి, కొత్తపాళ్యం, కొడగార్లగుట్ట, కొత్తపాళ్యంతాండ, రొళ్లకొండ, అలుపనపల్లి, ఏ.వద్రహట్టి, దాసప్పపాళ్యం, క్యాతప్పపాళ్యం, వన్నప్పపాళ్యం, జీఎస్ పాళ్యం, బాజయ్యపాళ్యం, పి.గొల్లహట్టి, గొట్టుగుర్కి, రంగనపల్లి, వెంకటంపల్లి తదితర గ్రామాల్లో ఉత్సవాన్ని జరుపుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు.



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



రత్నగిరిలో జ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న మహిళలు

క్లుప్తంగా

అశ్వవాహనంపై చౌడేశ్వరీదేవి



అమడగూరు: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరీదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరమ్మను బెల్లీరథంలో పురవీధుల్లో ఊరేగించారు. ధగధగ మెరిసే నగలు, పట్టు వస్త్రాలతో అభయమిస్తున్నట్లు కనిపిస్తున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. కాగా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలన్నీ మహిళలు, చిన్న పిల్లలతో కళకళలాడాయి. శనివారం అమ్మవారు సింహవాహనంపై దర్శనమివ్వనున్నట్లు ఆలయ ధర్మకర్త పాట్లా పురుషోత్తమరెడ్డి పేర్కొన్నారు.

మృతుడి ఆచూకీ తెలపండి

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బుధవారం రాత్రి లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దాదాపు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి నీలి రంగు ఫుల్ షర్ట్, నసీం రంగు ఫుల్ డ్రాయర్, వాల్కరో కంపెనీకి చెందిన బ్రౌన్ రంగు చెప్పులు ధరించి ఉన్నాడని, బట్ట తల ఉందని పేర్కొన్నారు. ఇంతకు మించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని, ఆచూకీ తెలిసిన వారు 94407 96842కు సమాచారం అందించాలని కోరారు.

కల సాకారం

- వైఎస్ జగన్ హయాంలో పూర్తయిన విద్యుత్ సబ్‌స్టేషన్లకు నేడు మంత్రుల ప్రారంభోత్సవం
- ఒక్కో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరు చేసిన జగన్ సర్కార్
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభానికి నోచుకోని వైనం



అమరాపురం మండలం శివరం వద్ద వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. నాడు ఎంతో ముందు చూపుతో వైఎస్ జగన్ వ్యవహరిస్తూ విద్యుత్ సమస్యల నుంచి రైతులను ఆదుకునేందుకు వీలుగా మడకశిర నియోజకవర్గానికి విరివిగా సబ్‌స్టేషన్లను మంజూరు చేశారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుల అభ్యర్థన మేరకు అప్పటి విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో అగళి మండలం రామనపల్లి, ఇనగలూరు, అమరాపురం మండలం శివరం, మడకశిర మండలం కదిరేపల్లి క్రాస్, వైబీ హళ్లి గ్రామాలకు 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. ఒక్కో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4కోట్ల చొప్పున కేటాయించారు. వీటిలో రామనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వెంటనే పూర్తి చేసి వైఎస్ జగన్ హయాంలోనే ప్రారంభించారు. సాంకేతిక సమస్యల కారణంగా శివరం, కదిరేపల్లి క్రాస్, వైబీ హళ్లి, ఇనగలూరు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు మందకొడిగా సాగడం, అనంతరం ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఈ విద్యుత్ సబ్‌స్టేషన్లు అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేకపోయాయి.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం..

వైఎస్‌జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరైన నాలుగు 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్, సవితమ్మ శుక్రవారం ప్రారంభించనున్నారు. అమరాపురం మండలం శివరం, అగళి మండలం ఇనగలూరు, మడకశిర మండలం వైబీహళ్లి, కదిరేపల్లి క్రాస్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లను మంత్రులు ప్రారంభించనున్నారు. అలాగే రొళ్ల మండలం రంగసపల్లిలో, గుడిబండ మండలం కేకేపాళ్యంలో, గుండుమలలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభంతో విద్యుత్ సమస్యలు తీరనున్నాయి.

వైఎస్ జగన్ చొరవతోనే..



వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు మడకశిర నియోజకవర్గానికి 5 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేశారు. కొన్ని సాంకేతిక కారణాలతో నాడు విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభానికి నోచుకోలేదు. అవే విద్యుత్ సబ్ స్టేషన్లను శుక్రవారం మంత్రులు ప్రారంభించనున్నారు. అయినా ఈ క్రెడిట్ మొత్తం వైఎస్ జగన్‌దేనని రైతులు అంటున్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంలో కూటమి ప్రభుత్వ పాత్ర ఎంత మాత్రం లేదని బహిరంగంగానే చెబుతున్నారు. – ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

రైతులకు వరం



వైఎస్‌జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లు నేడు రైతులకు వరంగా మారాయి. రైతుల కల సాకారమైంది. అగళి మండలానికి కూడా ఆ రోజు 2 విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్లను ఎవరు ప్రారంభించినా వైఎస్ జగన్‌కే పేరు రావడం ఖాయం. – చంద్రప్ప, మధూడి, అగళి మండలం

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్‌లో ఇద్దరికి చోటు



మల్లికార్జున కాటమయ్య

అనంతపురం అర్బన్: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. తమిళనాడులోని నాగపట్నంలో మూడు రోజులుగా ఏఐకేఎస్ జాతీయ మహాసభలు జరుగుతున్నాయి. చివరి రోజు గురువారం కౌన్సిల్ జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో సభ్యులుగా రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు అన్నగిరి కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జునకు చోటు దక్కింది.

యువకుడి ఆత్మహత్య



రవితేజ (ఫైల్)

రొద్దం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం మండలం ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన కాకర్ల వరలక్ష్మి, బుగ్గ రంగయ్య దంపతుల కుమారుడు రవితేజ (35) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున నొప్పి తీవ్రత తాళలేక ఓ పొలం వద్ద విషపు గుళికలు మింగాడు. కాసేపటి తర్వాత బంధువులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా తెలిపాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు గాలింపు చేపట్టి పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న రవితేజను గుర్తించి, వెంటనే తుమకూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'హంద్రీ-నీవా'కు శాశ్వతంగా సమాధి కడతారా?

- జలసాధన సమితి సభ్యుల ధ్వజం
- కాలువ వెడల్పుపై ఎమ్మెల్యేలు మాట్లాడాలి

హిందూపురం: రాష్ట్రంలోని కొన్ని ప్రాజెక్ట్‌లకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న కూటమి ప్రభుత్వం.. రాయలసీమకు జీవనాడిగా ఉన్న హంద్రీ-నీవా ప్రాజెక్ట్‌కు శాశ్వత సమాధి కట్టేందుకు సిద్ధమైందని జలసాధన సమితి సభ్యులు మండిపడ్డారు. ఈ మేరకు జలసాధన సమితి సభ్యులు చైతన్య గంగిరెడ్డి, శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 38వేల క్యూసెక్కులకు పెంచడానికి చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూనుకుందన్నారు. అలాగే 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే గాలేరు-నగరి ప్రాజెక్టు కాలువ సామర్థ్యం 30 వేల క్యూసెక్కులతో కాలువ నిర్మాణం చేస్తున్నారన్నారు. అయితే ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టు కాలువ సామర్థ్యం కేవలం 3,850 క్యూసెక్కులకు పరిమితం చేస్తూ, భవిష్యత్తులో కాలువను వెడల్పు చేసేందుకు లేకుండా లైనింగ్ పనులు చేపట్టి రాయలసీమ ఆశయాలకు శాశ్వతంగా గండి కొట్టేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. ఈ అన్యాయంపై జిల్లా ఎమ్మెల్యేలు నోరు విప్పకపోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా ముందు చూపుతో ఎమ్మెల్యేలు ఆలోచించి అప్రతిష్ట పాలుకాకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లి హంద్రీ-నీవా ప్రయోజనాలను కాపాడాలని హితవు పలికారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



మృతుడు బాలకృష్ణ

ధర్మవరం అర్బన్: స్థానిక రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న చేనేత కార్మికుడు బాలకృష్ణ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాజేంద్రకుమార్‌కు భార్య ప్రమీల, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మగ్గం పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

జూదరుల అరెస్ట్

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కోవెలగుట్టపల్లి సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద కొండల్లో జూదం ఆడుతున్న ఏడుగురిని పుట్టపర్తి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు... గురువారం అందిన సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కొండల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.61,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో గురువారం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. మహిళల స్వయం ఉపాధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేలా రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని, 75 శాతం హాజరు కలిగిన వారికి శిక్షణ చివరి రోజున కుట్టు మిషన్‌తో పాటు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉరకలెత్తిన దున్నలు



రాతిదూలం లాగుతున్న దున్నపోతులు

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన దున్నపోతుల రాతి దూలం పోటీలు ఆసక్తిగా సాగాయి. స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదిగా పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో రాతి దూలాన్ని లాగుతూ దున్నపోతులు ఉరకలేయడాన్ని చూసి ప్రజలు కేకలు, ఈలలతో హోరెత్తించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోటీలు సాయంత్రం 4 గంటలకు ముగిసాయి. రైతు కె.ముజ్జుకు చెందిన దున్నపోతులు 15 నిమిషాల వ్యవధిలో 2,608.10 అడుగుల మేర దూరాన్ని రాతి దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. మరో రైతు తిప్పేష్‌కు చెందిన దున్నపోతులు ద్వితీయ స్థానంలో, రైతు జి.రిజ్వంత్‌కు చెందిన దున్నపోతులు మూడో స్థానంలో నిలిచాయి. విజేత దున్నల యజమానులను అభినందిస్తూ సర్పంచ్ దంపతులు నిర్మల, డాక్టర్ సోమన్నతో నగదు పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో కణేకల్లు మేజర్ పంచాయతీ ఈఓ ప్రసాద్, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, స్థానికులు లాలెప్ప, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులపై విచారణ

కదిరి అర్బన్: పదో తరగతి ఇన్విజిలేషన్ విధుల్లో అలసత్వం వహించడంతో సస్పెండ్ అయిన కదిరి మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులపై విచారణ జరిగింది. పెనుకొండ డిప్యూటీ డీఈఓ పద్మప్రియ గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విచారణ నిర్వహించారు. నడింపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రుద్రంరెడ్డి, సైదాపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కిష్టప్ప సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. వారిద్దరి నుంచి రాతపూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారు. నివేదికను డీఈఓకు పంపనున్నట్లు తెలిపారు.

దౌర్జన్యంగా కూల్చేశారు

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి ఆవేదన



కూల్చి వేసిన షెడ్ వద్ద ఆంజనేయులు, రమాదేవి

రొద్దం: హైకోర్టు పరిధిలో నడుస్తున్న స్థల వివాదంలోని షెడ్డును పోలీసులను అడ్డుపెట్టుకుని రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా కూల్చివేశారంటూ రొద్దం మండలం ఎల్‌జీబీనగర్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఈడిగ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2021లో తన భార్య ఈడిగ రమాదేవి పేరున సర్వే నంబర్ 311లో ఇంటి స్థలానికి పట్టా ఇచ్చిందని గుర్తు చేశారు. అందులో ఓ షెడ్డు ఏర్పాటు చేసుకుని 2016 నుంచి అందులో నివాసముంటున్నామన్నారు. ఈ క్రమంలో షెడ్డును తొలగించాలంటూ అధికారిక ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో దీనిపై హైకోర్టును ఆశ్రయించినట్లు వివరించారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా గురువారం ఉదయం ఉన్నఫళంగా పెద్ద సంఖ్యలో పోలీసులను వెంటబెట్టుకొచ్చిన రెవెన్యూ అధికారులు.. జేసీబీ సాయంతో షెడ్డును నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ సమయంలో అడ్డుకోబోయిన తన భార్య రమాదేవిని బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్ నాయకులు ఎస్.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎల్‌జీబీనగర్ మారుతీరెడ్డి, ప్రసాదరెడ్డి, తదితరులు బాధితుడిని పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూల్చివేతపై హైకోర్టును ఆశ్రయించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డి తెలిపారు.

అది రోడ్డు పోరంబోకు స్థలం : తహసీల్దార్

కూల్చివేతపై తహసీల్దార్ ఉదయశంకరరాజు మాట్లాడుతూ.. పెనుకొండ – పావగడ ప్రధాన మార్గంలోని రోడ్డు పోరం బోకు స్థలంలో రేకుల షెడ్డును నిర్మించుకున్నట్లుగా గుర్తించామన్నారు. వారికి పట్టా ఇచ్చింది ఓ చోట అయితే మరో చోట రేకుల షెడ్డును నిర్మించుకున్నారని వివరించారు. ఈ స్థలంపై హైకోర్టులో వేసిన పిటిషన్ డిస్మిస్ అయిందన్నారు. దీంతో ఇంటి పట్టాను జాయింట్ కలెక్టర్ రద్దు చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశంతో రోడ్డు పోరం బోకు స్థలంలో ఏర్పాటు చేసుకున్న షెడ్డును తొలగించినట్లుగా పేర్కొన్నారు.

రూ.10 లక్షల విలువైన బైక్‌ల స్వాధీనం

- ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బత్తలపల్లి పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ వెల్లడించారు. అనంతపురం నగరానికి చెందిన ప్రణయ్, ధనూష్, సిద్ధి వినయ్ వ్యసనాలకు బానిసలుగా మారి జులాయిగా తిరుగుతూ తమ జల్సాలకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించడాన్ని పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు మైనర్లను కలుపుకున్నారు. వీరంతా కలసి ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. అనంతరం ఇతర రాష్ట్రాలకు చేరుకుని జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో బత్తలపల్లిలోని జాతీయ రహదారి కూడలిలో గురువారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వెళుతుండగా స్థానిక పోలీసులు అడ్డుకుని విచారణ జరిపారు. ఆ సమయంలో వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. బత్తలపల్లి, ధర్మవరం, అనంతపురం నగర పరిధిలో అపహరించిన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.10 లక్షలుగా ఉంటుందని నిర్ధారించారు. వీరిపై బత్తలపల్లిలో రెండు, ధర్మవరం టూ టౌన్ పరిధిలో మూడు కేసులు, అనంతపురంలో ఐదు కేసులున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మైనర్లను బాలుర పరివర్తన కేంద్రానికి తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్ఐ సోమశేఖర్, సిబ్బందిని సీఐ ప్రభాకర్ అభినందిస్తూ రివార్డులను అందజేశారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

- సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలతో యేసుక్రీస్తుపై విశ్వాసం ప్రకటించనున్న క్రైస్తవులు



పుట్టపర్తిలో విద్యుద్దీపాలంకరణలో వెలుగులీనుతున్న కింగ్స్ చర్చ్

హిందూపురం/పుట్టపర్తి టౌన్: క్రైస్తవ సమాజంలో అత్యంత ప్రత్యేకమైన రోజుగా పరిగణించబడే గుడ్ ఫ్రైడే రానే వచ్చింది. క్రైస్తవ విశ్వాసం ప్రకారం సమాజంలో నెలకొన్న చెడును తొలగించడానికి ఈ రోజున తన జీవితాన్ని యేసు క్రీస్తు త్యాగం చేశాడు. ఆ త్యాగాలను మననం చేసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలతో యేసుక్రీస్తుపై విశ్వాసం ప్రకటించేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. క్షమ, కరుణకు ప్రతిరూపంగా నిలిచిన యేసు క్రీస్తు.. లోకంలో పాపులను పరిశుద్ధులను చేసే క్రమంలో సిలువపై రక్తం చిందించిన దైవ కుమారుడిగా మరణించి కూడా పునరుత్థానుడై లేచిన సంఘటన ప్రపంచ చరిత్రలో మరెక్కడా కనిపించదు. ఆ ఘట్టాలను వివరించే గుడ్ ఫ్రైడే నుంచి ఆదివారం వచ్చే ఈస్టర్ పర్వదినం వరకు సాగే వేడుకలకు జిల్లాలోని ప్రతి ప్రార్థనామందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ప్రాణ త్యాగ సమయంలోనూ క్రీస్తు తన మరణ శిక్షను అమలు చేస్తున్న రోమన్ సైనికుల కోసం లోక రక్షకుడైన తన తండ్రితో 'తండ్రీ వీరు ఏమి చేస్తున్నారో ఎరుగరు.. వీరిని క్షమింపుము' అని ప్రార్థించి తనలోని దయ, కరుణ తత్వాలను లోకానికి చాటారు. సిలువపై క్రీస్తు చెప్పిన ఏడు సూక్తులు లోకానికి ఆరాధ్యాలయ్యాయి.

మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు..

ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా కేవలం దేవుడికి మన హృదయాన్ని సమర్పించుకునేలా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హిందూపురంలోని సీ అండ్ ఐజీ చర్చ్, సీ అండ్ ఐజీ కాంపౌండ్ మిషన్ చర్చి, జెరూసెలం చర్చి, బైబిల్ మిషన్ చర్చి, సీఎస్ఐ చర్చి, జియాన్ చర్చిలతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రై డే ప్రార్థనలు, శనివారం రన్ ఫర్ జీసెస్, ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించనున్నారు.

ఆదివారంతో ముగియనున్న శోకదినాలు

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు పాటించిన 40 రోజుల శోక దినాలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ 40 రోజుల పాటు శుభకార్యాలకు దూరంగా ఉంటారు. కనీసం నూతన దుస్తులు కూడా ధరించరు. పొరపాటున కూడా ఇతరులకు కీడు కలిగించే పనులు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్లోనే గడపడం ఆనవాయితీ. శుభ శుక్రవారం తర్వాత యేసు క్రీస్తు పునరుత్థానుడై లేచిన సందర్భంగా ఆదివారం పండుగను నిర్వహించేందుకు క్రైస్తవులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

సోదరభావాన్ని కలిగి ఉండాలి



యేసు ప్రభువు తన ప్రాణాన్ని సైతం అర్పించి మానవళికి మహోన్నత సందేశాన్ని ఇచ్చారు. ఆయన ఇచ్చిన ప్రేమ సందేశాన్ని ప్రజలందరూ పాటిస్తూ ప్రేమతో సోదరభావాన్ని కలిగి ఉండాలి. ఒక్కరిని ఒకరు గౌరవిస్తూ అందరితో సఖ్యత మెలగాలి.
– రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్‌రాజ్, పాస్టర్, సీ అండ్ ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చి, హిందూపురం

సన్మార్గంలో నడుచుకోవాలి



దైవకుమారుడి త్యాగంతో ప్రజలందరికీ మంచి జరిగిన శుక్రవారాన్ని శుభ శుక్రవారం అని చెప్పారు. దైవం చూపిన మార్గాన్ని అందరూ అనుసరించి పొరుగు వారితో ప్రేమతో, సోదరభావంతో మెలగాలి. క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ సన్మార్గంలో నడుచుకోవాలి.
– రెవరెండ్ డాక్టర్ కిరణ్‌మోహన్, పాస్టర్, సీ అండ్ ఐజీ చర్చ్, హిందూపురం

ప్రతి ఒక్కరూ ప్రార్థనల్లో పాల్గొనాలి



గుడ్ ఫ్రైడే ఒక మహోన్నతమైన రోజు. యేసు క్రీస్తుపై విశ్వాసం ఉంచి ప్రతి ఒక్కరూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిల్లోనూ ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రీస్తు చూపిన క్షమ, ప్రేమ గుణాలను అలవర్చుకుని సన్మార్గంలో నడవాలి.
– పాస్టర్ అరుణ్‌కుమార్, కింగ్స్ చర్చి, పుట్టపర్తి